# హృదయా వేదన! +

రచన:
శ్రీ అడపారామకృష్ణశ్రీ.

వస్తున్నాను
నీకోసం!
అన్వేషిస్తున్నాను.
నీ నీడకోసం!
నిరీక్షిస్తున్నాను
నీ జాడకోసం.

కాని నాకంతా శూన్యమైపోతుంది. ఐతే! ఈ అన్వేషా ఫలితమంతా వృధాయేనా! ఆశను చంపుకోలేక నీపై మమతను మాపుకోలేక పిచ్చిగా పయనిస్తున్నాను.

నీకోసరం వెదికి వెదికి వేసారి విసిగిపోయి కడసారిగా నింగీ నేలలు చిల్లులు పడేలా యేడ్వాలనిపిస్తోంది.

ఏడ్వలేకపోతున్నాను. భూమ్యాకాశాలు వెక్కిరిస్తున్నాయి. కసిగా తన్నెయ్యాలనిపించింది. కాని అంతలో నాపై అంతర్యుద్ధానికి ఉల్కలు ఊడిపడ్డాయి. ఆ సమయాన ఉరుముల - మెరుపుల ప్రేలుడికి భయపడ్డాను. ఆ భీతిలో దిండును కౌగిట బంధించుకున్నాను, నెచ్చెలియనే భ్రమపడ్డాను.

అది నా ఆత్మ సంతృప్తి.
నిరాశల నివృత్తి.

ఆ నాటి నీ వాడి చూపులు - ఈనాటి తూపులై నా జీవిత వలయంలో విరహ జ్వాలలై చెలరేగి చుట్టుముట్టి బంధించబూనాయి.

ఎదురు తిరిగాను.

దగ్ధమైపోతానని వెనుకంజ వేశాను. అగ్ని శిఖలు విజృంబిస్తూ నాపై ఉరుకుతున్నాయి.

అయినా! నా హృదిలోనుండి నిన్ను వేరు చేయలేను. నా నేత్రాలు సింధూర తిలకమువలె ఎఱ్ఱనై పోతున్నాయి.

యిక నిరీక్షించలేను.

ఓ ప్రేయసీ!

నీ మృదుమధురమైన హస్తాలతో మందార తరంగాలతో మల్లికా పరిమళములను నాచ్చాదింపజేసి నన్ను బంధించవేల. మనకెందులకింత వియోగం చెలీ! యిది యంతయు నిరుపమయోగమని నీకు తెలియదా?

నా మనో మందిరంలో సుందర రూపమై రాణించవా! ప్రకాశించవా!

అయ్యో! యేమిటీ నీలి నీడలు అనుక్షణం నన్నావరించి నలిపివేయుచున్నవి. హృదయం యెందుకిలా అదిరి బెదిరినట్లవుతుంది.

మహా భీకర గర్జన తర్జనలు నాలో గర్జించాయా. ఆశాలతలు చిగురించసాగాయా! లేలేత కోర్కెలు కవ్వింపసాగాయా!

ఏమిటీ నాలో ఈ వింత ప్రభావం నేనే-నీవు-నీవే-నేను.

నీ రూపం అపురూపం, నీవే నా స్వరూపం.
నా ఆశాసౌధానివి నీవు.

నా జీవన మాధుర్యానివి నీవు. మనల్ని లోకం చూచి నివ్వెరపోవాలని అప్పుడేమనలో కోర్కెలకు ఒకరూపకల్పన మందనుకున్నాను.

నీలో ప్రవహించు కాంతిరేఖలు దైదీప్య

మానవమె భూ మ్యా కా శా లు ప్రకాశించి పోవాలి.

భానుడు సిగ్గుతో చీకటి తెరలలో దాగి పోవాలి! సుధాంసుడు వెన్నెల సోయగాలను చిలికిస్తూ మనల్ని మైమరపించి మత్తులో ముంచేయ్యాలి!

అయ్యో! ఆశల తేనియలో విషబిందువులు చిందుతున్నాయి. యెందుకనో?

నీవు యేదూరతీర ప్రాంతాలల్లో పర్యటిస్తున్నావో! ఏమో!

ఈ అనంత విశ్వంలో యే నీలి మేఘాల చాటున యే మబ్బుతునకల మాటున మరుగై పోయావో కదా!

నిరంతరం నీకోసం యిలా తపిస్తూ తమసిలో కొట్టుమిట్టాడుతూ, తూలతున్నా నీకు జాలి కలుగ లేదా!

ఇంతటి యగ్ని పరీక్షకు నిలిపెదవా! నా తప్పొప్పులను క్షమించి ఈ నేత్రాలకు దర్శన భాగ్యం కల్పించవా?

ఈ ప్రపంచమంతా నన్ను వెక్కిరిస్తుంది. ప్రకృతి నన్ను అపహాస్యమాడుతున్నట్లుంది. అడుగడుగున అవమానాలతో అనుమానాలతో అధ:పాతాళానికి అణచివేయబడుతుంటే మరి నీకెలా నివేదించేది నాబాధ-

ఈ బలహీనతతో నే లోకం నన్ను లొంగదీసుకొంటుంది. లోతులు తెలియని హృదయాలను కొలబద్దలతో కొలవాలని చూస్తుంది.

అల్పత్వంతో, నిస్సంతృప్తితో నీదరి చేరుకోగలననే నమ్మకం నాలో పూర్తిగా సడలి పోతుంది.

ఈ స్థితిలో నేనేంచేయను?

వలపంతా విఫలమై నిశాధిలో విలపిస్తున్నాను. శూన్యమై, వికలమై, శోకంతో నిండిన నా హృదయ పేటికను ఛేదించి యందు నీయనురాగామృతం ఆనందంతో నింపావు. అది మళ్ళీ దుఃఖాశ్రువులతో మలినమైపోతుంది.

నేనిక నిలువలేను

తరలిరా ఓ! తరుణీ—

కరుణింపుము ఈదీనుని వేదన,

ఆనందపుటంచులు చవిచూపుసుతి మెత్తని

నీ అడుగుల సవ్వడి నాలో ప్రవేశపెట్టు.

నా హృదిలో కథలా నిలిచి, వెలసి కలిసిపో.

ప్రతిక్షణం నీకోసం తమసిలో తపిస్తూ తిరుగుతున్నాను.

నన్ను చూచిన తారలన్నీ మేఘాల చాటుకు పోతూ కొంటెగా తొంగి తొంగి చూడసాగాయి.

అకస్మాత్తుగా పంచ భూతాలు ప్రేరేపింప సాగాయి.

నాలో విషాద ఛాయలు చూస్తూ సానుభూతి తెలుపుతాయనుకున్నాను. కాని పెను భూతాల్లా యిలా విరుచుకుపడతాయనుకో లేదు.

ఆ ఉగ్ర రూపాన్ని చూడలేకపోయాను. నా కళ్ళల్లో కాంతి రేఖలు మటుమాయమై చీకటి తెరలు దట్టంగా అలుముకున్నాయి. చుట్టూ కటిక చీకటి. అంతా అగమ్యగోచరం,

అంతలో - చల్లగా, మెత్తగా నా కళ్ళను యెవరో నిమిరినట్లుంది,

ఆ కోమలమైన హస్తాలు నన్ను స్పర్శించగానే యేదో అనిర్వచనమైన భావన కల్గింది. కాని ఆ భావనయే బాధగా పగిలి పెగిలి పొగలు సెగలి వగలు రగిలింది. అణగారిన దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోయాను.

మనసులో యెంతగానో తూలనాడాను, వెలుగులేని ఈ జీవనపరిధి చుట్టూ నీ 'వెందుకని! ప్రక్కకు తొలగిపోయాను.

యెటు తొలిగిసా! యే వైపు పోగలను, ఏ దృష్టితో ఆమెను చూడగలను, అసలు నన్ను నేనెలా చూపుకోగలను.

హృదయమంతా విచ్ఛిన్నమై సెగలు కక్కుతోంది.

ఒక్కసారి గుండెల్లో వేయి ఈటెలతో పొడిచినట్లయింది.

వాడియైన కత్తులతో నేత్రాలను చీల్చుతున్నట్లవుతుంది.

యిక యేమిచేయగలను. జీవితమంతా ఛిన్నాభిన్నమైపోయింది. విష వాయువులు అంతరంగాన దట్టంగా అలుముకున్నాయి.

ఈ గోడు యెవరితో ఆలపించగలను, ఎలా విన్నవించి విలపించేది!

విరక్తిచెందిన ఈ మనస్సు ఖండ ఖండాలుగా చీలిపోతుంది.

చిట్టచివరిసారిగా కొండలన్నీ ప్రతిధ్వనించేలా అరిచాను బాధగా! రావే! ప్రియా! యని —

కొండలన్నీ ఒక్కసారి నా హృదిలో బండలై పాప సుకృతీ అంటూ ధ్వానితో తిరుగబడ్డాయి.

ఏమిటీ! విడ్డూరం. భూమండలంలో ప్రతి అణువు నాకు శత్రువైపోయింది.

అయితే ఈ జీవితమంతా యిలా పాప పంకిలమై పతనమైపోవలసిందేనా! ఈ బ్రతుకకిక వెలుగే లేదా! వెలుగే లేదా! అంతా శూన్యమేనా - శూన్యమేనా!

× × ×

ఒరేయ్! రామూ! యేమిట్రా నిద్రలో రాత్రంతా అంతగా కలవరిస్తున్నావు. పెళ్ళి చూపులకు అమ్మా నాన్నా నిన్ననేగా వెళ్ళారు. అప్పుడే ఆ అమ్మాయి యెలా వుంటుందోనని కలలు కంటున్నావేమిటి! అంటూ మా బామ్మ. నే కప్పుకున్న దుప్పటి తీసేసింది.

కల చెదిరిపోయింది. అంటే! కలలో బామ్మ మాట లెలా వినపడ్డాయని మీరనుకుంటారేమో!

మా బామ్మ రాక పూర్వ ఋణమే ఫలితమైపోయింది నా అందాల స్వప్నం!

కళ్ళు నులుముకుంటూ నిద్రాదేవి ఒడిలో నుండి లేచాను.

అరుణోదయపు కాంతులు దట్టంగా కిటికీ ఊచల వెంబడి నాపై విరజిమ్మాయి.

గోడ గడియారం అప్పుడే ఠంగ్! ఠంగ్! మంటూ ఎనిమిది కొట్టింది.

బెడ్ కాఫీ సేవించి కలలో కన్న హృదయవేదనకు గుడ్ బై చెప్పాను.

